# ఉద్యోగాల ఊసెత్తకుండా నిరుద్యోగులతో చెలగాటమా..?

నిధులు, నీళ్లూ, నియామకాల కోసం మొదలైన తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటానికి నాటి నిరుద్యోగ యువత, విద్యార్థి లోకమే కారణం. తెలంగాణ వస్తే చాలు తమకు ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని ఆశించి నాడు ఉద్యమంలో పాల్గొన్న యువకుల ఆశల పైప్రభుత్వం నీళ్లు చల్లింది. రాష్ట్రం ఏర్పాటై నాలుగేళ్లు కావొస్తున్న ఉద్యోగాల నియామకాల్లో ప్రభుత్వం నాలుగడుగులు కూడా వేయలేకపోయింది. లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని తాము అధికారంలోకి వస్తే నిరుద్యోగులందరికీ ఉద్యోగాల ఖాయమని ఎన్నికలసమయంలో పేర్కొన్న టీఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం నిరుద్యోగులను నిరాశకు గురి చేసింది. ఉద్యోగాలు రావేమోనన్న ఆందోళనతో  విద్యార్థులు ఆత్మ బలిదానాలకు సిద్ధపడేందుకు దోహదం అయింది.

నీళ్లు, నిధులు, నియామాకాల పేరుతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ పాలకులు మొదటి రెండు అంశాలను పక్కనపెడితే.. మూడో అంశమైన నియామకాలను పూర్తిగా విస్మరించి ఎందరో నిరుద్యోగులు, యువత జీవితాలతో చెలగాటమాడుతోంది. ఉద్యోగాల్లేక, ఉపాధికొరవడి తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన యువత ఆత్మబలిదానాలకు పాల్పడుతున్నా.. సర్కార్కు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయం. అసహనం పెరిగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న నిరుద్యోగులను చూసైనా ఈ పాలకులు తక్షణచర్యలకు ఉపక్రమించకపోవడం నిజంగా అమానుషం. మలిదశ తెలంగాణ ఉద్యమం కీలక దశకు చేరుకోవడానికి ముందు కిరణ్కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వేలాది పోస్టుల భర్తీకి ప్రకటనలు జారీ చేసేందుకు సన్నద్ధమయ్యారు. అయితే మా పోస్టులుమేమే నింపుకుంటాం.. మా పాలన మేమే చేసుకుంటామంటూ విడుదలకు సిద్ధంగా ఉన్న నోటిఫికేషన్లను నిలిపివేయించిన కేసీఆర్.. అవ్వా పెట్టా పెట్టదు.. అన్నట్లు.. అప్పుడు ఉద్యోగాలు భర్తీ చేయకుండా అడ్డుకోవడమే కాక .. ఇప్పటికీ ఖాళీ పోస్టులను మాత్రంనింపలేకపోయారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు సైతం నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. అడపా దడపా ఉద్యోగాల భర్తీకి అప్పటి ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. దౌర్భాగ్యం ఏమిటంటే.. సొంత రాష్ట్రంలో కనీసం ఆ మోతాదులో కూడా ఉద్యోగ ప్రకటనలు కూడా విడుదలకాకపోవడం...! ఉద్యమ సమయంలో లక్షా 12 వేల ఖాళీలను భర్తీ చేస్తామన్న కేసీఆర్...రాష్ట్రం ఏర్పడి మూడున్నరేళ్లయినా ఇప్పటి వరకు కేవలం దాదాపు 29 వేల పోస్టులను మాత్రమే భర్తీ చేసినట్లు స్వయంగా టీఎస్పీఎస్సీ ఛైర్మనే ప్రకటించడం బట్టి చూస్తే నిరుద్యోగులకుఎంత అన్యాయం జరుగుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉన్న ఖాళీలు లక్షా 12 వేలు.

కానీ ఆ సంఖ్య ఇప్పటివరకు దాపు 3 లక్షలకు పెరిగిందని అధికారుల అంచనా. అదే సమయంలో పది జిల్లాలుగా ఉన్న తెలంగాణ కాస్త 31జిల్లాలుగా విభజన కావడంతో అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ ఖాళీలు ఏర్పడ్డాయి. ఉన్న ఉద్యోగుల్ని కొత్త జిల్లాలకు పంపించిన తరుణంలో.. కొత్త, పాత రెండు జిల్లాల్లోనూ భారీ ఎత్తున ఉద్యోగులు కావాల్సి ఉంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా సమస్యలు పెరిగిపోయి..ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు కూడా విపరీతంగా పెరిగిపోయి ఎక్కడికక్కడ పనుల్లో తీవ్ర జాప్యం జరగుతోంది. ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల్లోని ఖాళీలను కలుపుకొంటే ఆ సంఖ్య మొత్తం దాదాపు మూడు లక్షలకు పైగానే ఉంటుందని ఉద్యోగ సంఘాలే స్పష్టం చేస్తున్నాయి.వీటన్నింటిని భర్తీ చేసేందుకు ప్రభుత్వానికి ఉన్న అడ్డంకులు ఏంటో అర్థం కావడం లేదు. రాష్ట్రంలో ఇప్పటికే దాదాపు మూడు లక్షల వరకు ఖాళీలున్నా.. వాటిని భర్తీ చేయకుండా కేవలం స్వార్థ రాజకీయాల కోసం కాలయాపన చేస్తున్నారన్న విమర్శలకు ఈప్రభుత్వపాలకులు ఏం సమాధానం చెబుతారు...?

ఏపీలో ఇప్పటికే రెండు డీఎస్సీ ప్రకటనలు విడుదల చేస్తే.. అదే తెలంగాణలో మాత్రం ఒకే డీఎస్సీని రెండు సార్లు విడుదల చేయాల్సిన దుస్థితి. రాష్ట్రంలో దాదాపు 40 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలుంటే.. అందులో కేవలం 8వేల పోస్టుల భర్తీకి పూనుకున్నారు. విడుదలచేసిన నోటిఫికేషన్ సైతం తప్పుల తడకగా మారడంతో.. డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థుల్లో తీవ్ర నిరసన పెల్లుబికింది. దీంతో తేరుకున్న సర్కార్ వెంటనే మరో నోటిఫికేషన్ విడుదల చేసింది.

అయితే.. గత ఐదారేళ్లుగా డీఎస్సీ లేకపోవడంతో.. గంపడాశతో ఎదురుచూసిన నిరుద్యోగులకు ఈ నోటిఫికేషన్ కూడా తీవ్ర నిరాశనే మిగిల్చింది. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో ఖాళీలున్నప్ప టికీ.. ఆ మోతాదులో ప్రకటనలో పేర్కొనకపోవడంతో అభ్యర్థులు పూర్తి నిస్తేజంలోకివెళ్లిపోయా రు. ఇప్పటికే అనేక ప్రభుత్వ పాఠాశాలల్లో ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందడంతో వేలా ది మందిని వాలంటీర్లను నియమించి నెట్టుకొస్తున్న పరిస్థితి. చేస్తున్న ఉద్యోగానికి ప్రైవేటు పా ఠశాలల్లో సరైన భద్రత లేకపోవడంతో అభ్యర్థులు కూడా విద్యార్థులకుసరైన న్యాయం చేయలే కపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో ఫలితాలు ఆశించిన తీరులో రాక పాఠశాల విద్య కుంటుపడుతున్న పరిస్థితి ఉంది.

అనేక మంది బిఎడ్, ఎంఎడ్ వంటి ఉన్నత విద్యనభ్యసించినప్పటికీ ప్రైవేటు పాఠశాలల్లో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తూ... చాలీ చాలని జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్నారు. పని భారం పెరిగినా... వేతనాలు పెరగక ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు తీవ్రనిస్తేజానికి గురై జీవితంపై విరక్తితో కాలం వెల్లదీస్తున్నారు.

మరోవైపు రాష్ట్రంలోని వేలకొద్ది కళాశాలల్లో సరైన లెక్చరర్లు లేక జూనియర్, డిగ్రీ కళాశాలల ప రిస్థితి తీవ్ర గందరగోళంలోకి నెట్టబడింది. ఎక్కడ చూసినా.. అధ్యాపకులు లేక ఉన్నత విద్య అ వస్థల్లో కూరుకుపోయింది. వేల సంఖ్యలో ఉన్న అధ్యాపకుల ఖాళీలను ఏళ్లకేళ్లుగాభర్తీ చేయక పోవడంతో... ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒకే అధ్యా పకుడితో సమీపంలోని రెండు మూడు కళాశాలల్లో పాఠాలు చెప్పించడం, లేదంటే గెస్ట్ ఫ్యాకల్టీ తో మమ అనిపించడంతో.. అటు పాఠాలు సరిగ్గా పూర్తికాక, చదివేచదువులు అర్థం కాక విద్యా ర్థులు తీవ్ర గందర గోళ పరిస్థితిలో ఉన్నారు. వీటికి తోడు యూనివర్సిటీల్లో సైతం వేల సంఖ్యా లో అధ్యాపకుల ఖాళీలు భర్తీకి నోచుకోవడం లేదు. అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకుండా.. గెస్ట్ ఫ్యాకల్టీ, తాత్కాలిక ఉద్యోగులతో పాఠాలుచెప్పిస్తుండటంతో ప్రతిభ గల లెక్చరర్లు లేక వి ద్యార్థులకు సరైన చదువులు రాక .. నాణ్యత లోపించి విద్యా వ్యవస్థ పూర్తిగా భ్రష్టు పోయింది. నిరుద్యోగ సమస్య పెనుభూతంలా మారి అందరినీ భయపెడుతున్నా, తెలంగాణ ఏర్పాటై మూ

డున్న రేళ్లయినా... ఇంతవరకుకనీసం ముప్పై వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయక పోవడం నిజంగా సిగ్గుచేటు.

మరోవైపు ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లో ప్రతి 15 మంది విద్యార్థులకు ఒక అధ్యాపకుడు ఉండాలన్న నిబంధనను మార్చిన ఏఐసీటీఈ తాజాగా దాన్ని 20 మందికి సడలించింది. దీంతో ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న కొందరు అధ్యాపకులు ఇంటిదారి పట్టక తప్పనిపరిస్తితి ఏర్పడింది. ఈ క్రమంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరికొన్ని వేల మంది నిరుద్యోగులు పెరిగే అవకాశం లేకపోలేదు.

అంటే ఒక ఇంజినీరింగ్ కాలేజీలో 240 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం 16 మంది అధ్యాపకులు కావాలి. కానీ సడలించిన నిబంధన ప్రకారం... వచ్చే విద్యాసంవత్సరం నుంచి కేవలం 12 మంది సరిపోతారు. ఈ లెక్కన తెలంగాణలో దాదాపు 15000 మంది అధ్యాపకులుతమ ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తోంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే ప్రధానంగా ఉన్న నిరుద్యోగ సమస్య మరింత జఠిలం అయ్యే సూచనలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఐదారేళ్లుగా ఖాళీగ ఉన్న పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదన్న ప్రశ్నతలెత్తుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక ఎమ్మెల్యే పదవి ఖాళీ అయితే కేవలం ఆరు నెలల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించి మరో ఎమ్మెల్యేను ఎన్నుకుంటారు. అలాంటిది రాష్ట్రంలో ఏళ్లకేళ్లుగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను ఎందుకు భర్తీ చేయరన్న ప్రశ్న నిరుద్యోగుల్లో పెల్లుబికుతుంది. ప్రజల చేత ఎన్నుకోబడ్డ పాలకులకు ఒక నిబంధన.. పౌరులకు మరో నిబంధనా..? అంటూ నిరుద్యోగులు తీవ్ర నిరసన వెలిబుచ్చుతున్న పరిస్థితి ఉంది.

చాలామంది తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత భవిష్యత్తు అందించాలన్న తాపత్రయంతో అప్పులు చేసి మరీ.. వారి పిల్లల్ని చదివిస్తున్నారు. డిగ్రీ, పీజీ పూర్తవగానే వేలకు వేల రూపాయలు వెచ్చించి కోచింగ్ సెంటర్లకు పంపిస్తున్నారు. ఈ రోజు కాకపోతే రేపైనా ఏదోఒక నోటిఫికేషన్ రాకపోతుందా...? తమకు ఉద్యోగం లభించకపోతుందా...? అన్న ఆశతో లక్షల మంది నిరుద్యోగులు తమ విలువైన సమయాన్ని లైబ్రరీలు, కోచింగ్ సెంటర్లలో గడిపేస్తున్నారు. కొత్తగా

ఏర్పడ్డ తెలంగాణ సర్కార్పై కోట్ల ఆశలు పెట్టుకున్న యువత,నిరుద్యోగులు ఎంతో సంయమ నంతో పుస్తకాలతో కుస్తీ పడుతూ.. పోటీ పరీక్షల కోసం ప్రిపరేషన్ను కొనసాగిస్తున్నారు. భవు షా..ఇలా మూడున్నరేళ్ల పాటు ఏ ఉద్యోగానికి ఎవరూ ప్రిపేర్ కారేమో...!? ఇంత వ్యయ ప్రయా సలకోర్చినా చివరికి అటు ఉద్యోగ ప్రకటనలు వెలువడక..ఇటు ఏజ్ బార్ అవుతుండటంతో చా లామంది యువకులు,నిరుద్యోగులు దిక్కుతోచనిస్థితిలో మౌనంగా రోదిస్తున్నారు. ఉద్యోగాలి వ్వండి మహాప్రభో అంటూ గొంతెత్తి మొత్తుకుంటున్న విద్యార్థులను తెలంగాణ రాష్ట్రం ప్రభు త్వం అడుగడుగునా నిర్బంధాలకు గురిచేస్తూ..అణచివేతలకు పూనుకుంటున్నారు. ఎన్నికల కు ముందు ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఊదరగొట్టిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక... ఉద్యో గాల భర్తీ ప్రక్రియను పూర్తిగా విస్మరించి రాజకీయ కార్యకలాపాల్లో మునిగి తేలారు.

అయితే కేసీఆర్కు ముఖ్యమంత్రి కొలువు, ఆయనకుమారుడు కేటీఆర్కు మంత్రి కొలువు, అ ల్లుడు హరీష్రావుకు మంత్రి పదవి, పనిలో పనిగా ఏకైక కూతురు కవితకు ఎంపీ కొలువులైతే దక్కాయి. కానీ రోజురోజుకు ఏజ్ బార్లై (వయసు మీరి) పోతున్న విద్యార్థులకు మాత్రం చివరికి నిరాశ, నిస్పృహలే మిగిలాయి. పనిచేయగలిగిన శక్తి ఉండి.. పనిచేయలేని స్థితిలో యువత ఉంటే అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టంగానే పరిగణించాలి. యువశక్తిని సరైన రీతిలో ఉప యోగించుకోలేని ఏ వ్యవస్థ అయినా ఆర్థికంగా మనుగడ సాధించడం కష్టం. దీంతో తలసరి ఆ దాయం మందగించి..అది జాతీయాదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపెడుతుందనేది ఆర్థిక సూత్రం . అంటే పనిచేయడానికి సిద్ధంగా ఉన్న యువతకు చేతికి పని కల్పించాల్సిన ప్రభుత్వాలు, పా లకులు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తూ భవిష్యత్ భారతావనికి ఎలాంటి సంకేతాలు అందిస్తున్న ట్లోఒక్కసారి ఆలోచించాలి.

లక్షల మంది నిరుద్యోగులున్న రాష్ట్రంలో కేవలం పదులు, వందల్లో ఖాళీలను భర్తీ చేస్తే అది ఎంతవరకు సరిపోతుందో పాలకులు ఆలోచించాలి. యువతకు ఉపాధి మార్గాలు కల్పించేందు కు కనీసం స్వయం ఉపాధి పథకాలైనా అమలు చేయకుండా, చోద్యం చూస్తూ..యువలోకానికి ఎలాంటి సంకేతాలిస్తున్నట్లో ప్రభుత్వం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. నిరుద్యోగులను

మాటల గారడితో మాయ చేస్తున్న కేసీఆర్.. రాజకీయ ప్రయోజనాల కోసం యావత్ నిరుద్యోగ లోకాన్ని వంచించడం విస్మయపరిచేలా ఉంది. తెలంగాణఉద్యమంలో ప్రాణాలు పణంగా పెట్టిన విద్యార్థులు, యువకుల త్యాగాలను విస్మరించి రాజకీయాల కోసం ఇంతమందిని దగా చేస్తోన్న ఈ సర్కార్ నిర్వాహకాన్ని ఏ పేరుతో పిలిస్తే సరిపోతుందో మేధావులు ఆలోచించాలి.

యువతలో అసహనం పెల్లుబికుతున్నప్పటికీ..ప్రభుత్వం మాత్రం ఎక్కడికక్కడ దాన్ని అణచివేస్తూ వస్తోంది. అదే సమయంలో అంతా బాగుందన్న భ్రమల్ని పెంపొందించేలా ఎన్నో ఉద్యోగాలిచ్చామంటూ అసత్య ప్రకటనలు గుప్పిస్తోంది. ప్రస్తుత పాలకులకు నిరుద్యోగుల ప్రయోజనాలు పట్టకపోవచ్చు కాక.. కానీభవిష్యత్ తరాలకు మాత్రం వీరి చర్యలు తీవ్ర నష్టాన్ని చేకూర్చే ప్రమాదం పొంచి ఉందనేది ఎవరూ కాదనలేని సత్యం. భావి తరాలకు బంగారు భవిష్యత్తు అందించలేని ఈ వ్యవస్థ... ఇప్పటికే అవస్థల్లో చిక్కుకుందన్న వాస్తవికతను పాలకులు ఎపుడు అర్థంచేసుకుంటారో కాలమే నిర్ణయించాలి....?!

పాలకులు ఇప్పటికైనా జాగురూకతతో వ్యవహరించి నిరుద్యోగ సమస్య తీవ్రతను గుర్తించాలి. వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు భారీ ఎత్తున ఉద్యోగ ప్రకటనలు విడుదల చేసి నిరుద్యోగ లోకానికి న్యాయం చేయాలి. స్వార్థ ప్రయోజనాలను పక్కన పెట్టి... రాష్ట్రంలోతీవ్రంగా ఉన్న నిరుద్యోగ సమస్యపై ప్రభుత్వం తక్షణ కార్యాచరణకు శ్రీకారం చుట్టాలి. తక్షణమే ఉద్యోగ ఖాళీల సమాచారాన్ని సేకరించి ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించాలి. ఎప్పటికప్పుడు..ఎక్కడికక్కడ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయడంతో పాటు.. రిక్రూట్మెంట్ ప్రక్రియలోబంధుప్రీతి, అవినీతి, ఆశ్రిత పక్షపాతానికి తావు లేకుండా.. కేవలం ప్రతిభా పాటవాలకే పట్టం కట్టేలా వ్యవహరించాలి. నిరుద్యోగ సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలి. అందుకోసం పకడ్బందీ ప్రణాళికరూపొందించి దాని అమలుకు కార్యోన్ముకులు కావాలి. లేకపోతే... జడలు విప్పిన నిరుద్యోగ సమస్య.. యావత్ యువత పెడదారి పట్టించే ప్రమాదం ఉంది.

డాక్టర్ కె లక్ష్మణ్

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు